వినాయక సాయిరాం

## గ్రామ దేవతల పూజలు – కోడి పందేలు

జానపద సాహిత్యం జానపద కళకు సంబంధించిన సృష్టి. తెలుగు జానపద సాహిత్యానికి కాల పరిధిని నిర్ణయించాలంటే లిఖిత రూపంలో కనబడుచున్నంత వరకూ అవి క్రి.శ. 12వ శతాబ్ది అవతలి వైపు లభింపవు. కానీ శ్రీనాధునివంటి పండితుల ఆదరణమూలంగా విద్యావంతుల సమాజంలోనికి పలనాటి వీర చరిత్ర చొచ్చుకొని వచ్చింది. అయినా ఈ సాహిత్యానికి ప్రముఖ లక్షణమైన మౌఖిక ప్రచారం కారణంగా ఏనాడు పుట్టినా, ఎంత ప్రాచీన చరిత్ర కలిగి ఉన్నా అదంతా మనకు స్ఫుటంగా తెలిసే అవకాశం లేకుండా పోయింది. మనకు స్పష్టంగా తెలియనంత మాత్రాన దాని ప్రాచీనతను శంకించనవసరం లేదు.

జానపద కథల్లో రేణుకా ఎల్లమ్మకు మాతృ పూజ చేస్తారు. మాతృపూజా పద్ధతి ఈ నాటికీ జానపద కథల్లో నిత్యహరితంగా నిలిచిపోయి ఉంది. జానపద సాహిత్యంలో ఎన్నో కథల్లో ప్రాముఖ్యం వహించేది ఈ అంశమే. ఇక్కడ ప్రతి గ్రామదేవత రూపంలోనూ తల్లి దేవత ప్రత్యక్షమవుతుంది. కొండాపురం, ఎల్లేశ్వరం, సంగమేశ్వరం, అలంపురం వంటి అనేక శిల్పఖనులైన స్థలాలలో ఉండే స్త్రీ ప్రతిమలను చూస్తే,ఈ అంశం స్పష్టంగా తెలుస్తుంది.నగ్న ప్రతిమలు చేతులలలో మామిడి పండ్లు పూర్ణకలశాలు ధరించిన ప్రతిమలు, శిశురూపాలను చేరువగల ప్రతిమలు గ్రామ దేవతా రూపంలో తల్లిదేవతను తలపిస్తుంది. రేణుక అనే నామాంతరం కల ఎల్లమ్మ జానపదుల తల్లి దేవత.

ఈ మాతృ పూజా విధానంలో కొన్ని ప్రక్రియలు విశిష్టంగా కనిపిస్తాయి. అవి 1) ప్రార్ధన, 2) బలివిధానం, 3) పవిత్రీకరణ, 4) ఆత్మహింస అనేవి వీటికిన్నింటికీ జానపద కథలలో సముచిత స్థానం ఉంది.

ఈ గ్రామ దేవతలకు సంబంధించిన పూజా కలాపంలో బ్రహ్మణులకు ప్రాతినిధ్యం లేదు. ఆయా దేవతలకు కాలక్రమాన నిర్ణయించిన స్వరూప స్వభావాలను అనుసరించి జన చరిత్రనుబట్టి ఒక్కొక్క తెగవాడు పూజారిగా వ్యవహరించడం జరిగింది. ఆంధ్రదేశంలో గ్రామదేవతల చరిత్ర పరిశీలిస్తే రేణుక బైండ్ల వారి ఇంట్లో జన్మించింది. గంగమ్మ యాదవుల కులదైవం. అందుకే ఎల్లమ్మ పూజారుల బైండ్ల వాండ్లు గంగమ్మ పూజారులు యాదవులు. పిన్నమ్మ, పోశమ్మ వంటి దేవతలకు ఒక్కొక్కసారి చాకలి పౌరోహిత్యం ఉంటుంది. ఈ పూజారులు ఉచ్చరించే మంత్రాలన్ని తెలుగుమంత్రాలే.

స్తోత్రాలు చాలా వరకు కీర్తనలుగా ఉంటాయి. ఎక్కువగా ద్విపదలు ఉంటాయి. దేవిముందు జానపదులు నెఱపే ప్రార్ధనలు కుతూహలాన్ని కలిగిస్తాయి. పంటకోసం గింజలు ఎదురుగా పె డుతూ లచ్చుమ్మ దేవతను కొలిచే వాళ్ళు.

"సామి అమ్మ, లచ్చిమి అమ్మ, మంచిగ పండితెనీకు పెడ్తం" అంటారు. కోతల ముందు అన్నం వండి మూడు రాళ్ళచే నిర్దేశింపబడ్డ లచ్చమ్మ దేవత ముందు పెట్టి.

"సామి తల్లి. లచ్చమ్మతల్లి పండినమటుకు మేము పెట్టినాము దండం అంటారు. పెండ్లివేళ" బోరమ్మతల్లీ పిలగాడు పిల్ల మంచిగె బతకాలి" అని ప్రార్థిస్తారు.

ప్రసవ సమయంలో గార్ల మైసమ్మనుద్దేశించి పిల్లవాడు ఊడిపడ్తే సేరుజొన్నలు తెచ్చి నీకు మొక్కుతాం" అంటారు.

గత్తర చెలరేగినప్పుడు పోశమ్మనుద్దేశించి "పోశమ్మతల్లీ! ఏటుకు శాయకు మాకు దొరికింది నీకు పెడతాం తినిపో" అని అర్థిస్తారు.

పుట్టు వెంట్రుకలు తీసినపుడు వాటిని పారే ప్రవాహంలో వేసి గంగమ్మకు మొక్కుతూ– ""గంగమ్మ తల్లీ పుట్టుగెంటి గెలు నీ పొట్టల యేసినాం మా పిల్లలు మంచి గుండాల – అని ప్రార్థిస్తారు.

వేటలో జంతువు దొరికితే దాని ముంగాలి ముక్క కొంత కోసి దాన్ని కాలేయాన్ని అడవి వైపు విసరేసి "సామి దేవరా మేము తింటున్నాం నీవు తిను" అని కృతజ్ఞత చూపిస్తారు.

ఇక్కడ దేవతల అంగాంగ వర్ణన కానీ, మిగిలిన దేవతా చక్రంలో ఉండే సంబంధం కానీ మహత్త్వ ప్రశంస కానీ లేదు. మనిషికీ. దేవుడికి మధ్య గట్టి బంధాన్ని కలగజేసేది కేవలం ఆహార నివేదనం మాత్రమే అన్న అభిప్రాయం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. ఈ నైవేద్య సమర్పణము దానికి సంబంధించిన ఉదంతాలన్ని జానపద కథల ద్వారా చాలా వివరంగా గ్రహించడానికి వీలున్నది.

బలిక్రియ : గ్రామ దేవతల పూజలలో పండ్లు, ఫలాలు వంటి ఆహారాన్ని నివేదించడమే కాకుండా బలిక్రియ ప్రధానంగా కనిపిస్తుంది. భక్తుడు దైవంతో తన్ను అభేదం చెప్పుకొంటూ ఏకత్వ స్థాపన కోసం తన ఆత్మనే ఆకర్షించుకునే పద్ధతి మరొకటి. జానపద గాథల్లో తల్లిదేవత రక్తప్రీతి కల దేవత. ఆవిడ బలి కోరుకుంటుంది.

ఎత్తు గొఱ్ఱెలు చాలా ఏటలు కోళ్లు
మేకపోతులు గొప్ప మైసమ్మ తానూ
సాక బాసిన కల్లు సారాకావళ్ళు
ఆరంబుగైకొని తృప్తి చెందుతుంది.

ఈ బలిక్రియ ఉనికి పురాణ గాథలలో ఉంది. అశ్వమేధం శూలాగవం అనే సవన క్రియలు బలిక్రియలే. నరమేధం కూడా అతి ప్రాచీన కాలం నుండీ వినిపిస్తున్న బలిక్రియలే. ప్రాచీన సాహిత్యంలో దీని ప్రస్తావన ఉంది. హర్ష చరిత్రలో భట్టబాణుడు నరమాంస విక్రేతలను, స్మశానాలలో నిర్వర్తింపబడే నరహనన రూపమైన భయంకర కర్మకాండను వివరించాడు.

కలికి పురాణంలో నరబలులను గురించి ఒక ప్రకరణం ఉంది. శ్రీ శైల భ్రమరాంబిక ఆలయంలోను, బెజవాడ కనకదుర్గ ఆలయంలోనూ ఒకప్పుడు నరబలులు సాగేవని చెప్పడానికి దృష్టాంతాలున్నాయి. ఇవి రెండూ తల్లిదేవతలను సూచించే శక్తిస్థానాలే.

ఒకప్పుడు భారతదేశంలోనూ బలి విధానం ఎక్కువ గానే ఉండేది. ముఖ్యంగా పంటలను కోసేటప్పుడు దూర ప్రాంతం వాళ్లని పట్టి తెచ్చి కాళ్ళూ చేతులూ నరికి ఆ ముక్కల్ని పంట భూమి మధ్యలో వేలాడదీసే వాళ్ళు. చిన్న పిల్లలనుచంపి చర్మం ఒలిచి ఆ ముక్కలను గాదెల్లో దాస్తే ఆ పంట అక్షయమవుతుందనే నమ్మకం చాలా చోట్ల ఉండేది. మూఢ నమ్మకాలతో క్రూరమైన విశ్వాసాలను నమ్మకాలను కలిగి ఉండడం ఆశ్చర్యకరమైన విషయం.

ఈనాటి కాలంలో కూడా పంటకాపు పంటవచ్చిన తర్వాత కుప్పనూర్చి తూర్పార బెట్టి 'యాట' ను (పోతును) పొలంలో కోసి తోలునూ, ఎముకలనూ పొలం మధ్యలో పూడిచి పెడతాడు. ఆ మాంసాన్ని అన్నాన్ని అక్కడే వండుకుని తామూ, పాలివాండ్రూ అక్కడే భోజనాలు చేస్తారు. ఆ అన్నం ఎవరికి పెట్టకూడదు. ఇంటికి తీసికొని వెళ్ళకూడదు. మిగిలితే అక్కడే గొయ్యి తీసి పూడ్చి పెట్టాలి తప్ప ఎవరూ ఉపయోగించకూడదు. ఇది మరొక విచిత్రమైన నమ్మకం జానపదుల విశ్వాసం.

పవిత్రీ కరణం :– నిప్పుల్లో కాలి సత్యానికి నిలబడే వాళ్ళని గురించి, అగ్నిస్నానం స్త్రీల పవిత్రతను నిరూపించడానికి ఉపయోగించడం జానపదాలలో కనిపిస్తుంది. రామాయణంలో కూడా అగ్ని పునీత సీత అనే విషయం చెప్పబడింది. గుండం తొక్కడం, నిప్పును ఒడికట్టడం, తలమీద గండ దీపాలెత్తు కోవడం, చేతిదండలకు, వ్రేళ్ళకు కనురెప్పలకు ఇతర శరీర భాగాలకు సూదులు గుచ్చుకుని నూనెలో వత్తులను ముంచి దీపాలు వెలిగించడం జానపదులలో తరచు కనిపిస్తుంది.

నిప్పుతొక్కే ప్రక్రియ ద్రౌపదీ దేవి గుడి దగ్గర, గంగ జాతర సమయంలో కనిపిస్తుంది. జానపదుల పాటలలో ఈ నిప్పు తొక్కడం వల్ల దేవి తమ మీద చల్లని చూపును ప్రసరించి పశువులను, పంటలను కాపాడుతుందనీ, ఈతిబాధలు లేకుండా చేస్తుందనే ప్రగాఢ విశ్వాసం కనిపిస్తుంది.

ఈ నిప్పుతొక్కే ఉత్సవం సాధారణంగా పన్నెండేళ్ళకొకసారి వచ్చే ఉత్సవంగా పది రోజుల పాటు జరుగుతుంది. నిప్పుతొక్కడానికి సిద్ధపడిన భక్తుడు ముందు రోజు స్నానం చేసి పసుపు వస్త్రాలు ధరించి ముంజేతికి కుంకుమ పూసిన తోరాన్ని కట్టుకుంటాడు. ఆ రాత్రి గుడిలో ఉపవాసంతో శయనిస్తాడు. మర్నాడు స్నానం చేసి శుచిగా శక్తిని పూజిస్తాడు. గుండం తొక్కడానికి ముందు అంతా సరిగా ఉందా లేదా అనే పరీక్షలు చేస్తారు.

అవి 1) మట్టికుండ అంచు మీద కత్తిమొనను నిలబెట్టడం.

2) పసుపు గుడ్డలో నిప్పులు మూట కట్టడం

3) అంతకుముందే దేవి బడిలో కట్టిన పువ్వులు, నిమ్మకాయలు వాడకుండా ఉన్నాయో లేదో

సరిచూసుకోవడం

4) దేవిచీర కొంగుకు నిప్పులు కట్టి కాలలేదన్న విషయాన్ని నిర్ధారణ చేసుకోవడం

తర్వాత ద్రౌపదీ దేవి విగ్రహం ఊరేగింపు జరుగుతుంది. పూజారి పసుపు గుడ్డలు కట్టుకొని పూలదండలు వేసుకొని నిప్పుల గుండాన్ని ఈ చివరి నుంచి ఆ చివరకు నడుస్తాడు. మొక్కులు తీర్చుకొనే భక్తులు కూడా అతడిని అనుసరిస్తారు అలా నడుచుకుంటూ మూకుడు నిండా నిప్పులు తీసికొని తలపై దిమ్మరించుకుని నిప్పులతో అగ్ని స్నానం చేస్తారు. గుండం చల్లారాక బూడిదను తలోకొంచెం ఇళ్ళలో దాచుకుంటారు. బూడిద ఉన్న ఇంట్లోకి దెయ్యాలు, భూతాలు రావని వారి నమ్మకం.

4) **దేవిపూజలోమరో ప్రధానాంశం ఆత్మహింస**:-

ఆత్మహింస కూడా జానపద కథలలో అనేక చోట్ల కనిపిస్తాయి. చెవుల్లో నారసాలు పోయడం, నాలుక మడుచుకుని కొర్రులు పెట్టుకోవడం, వీపుల్లో కొంకిగాలాలు, కనురెప్పలకు సూదులు గుచ్చుకోవడం వంటివి. ఇందులోనే సిడివ్రేలాడడం అనే ఒక ఆచారాన్ని కూడా జానపదులు అనుసరిస్తారు. 1854లో అనంతపురం జిల్లాలో 125 స్థలాలలో ఈ సిడిమ్రాను ఆచారాన్ని అనుసరించినట్లు థర్స్టన్ పండితులు వివరించారు.

**సిడి అంటే** :- నిలువుగా పాతిన ఒక కఱ్ఱ చివర అడ్డంగా దూలం అమర్చబడి ఉంటుంది. ఆ దూలం చివర కప్పీలకు 28 అడుగుల పొడవు గల త్రాడు వ్రేలాడుతూ ఉంటుంది. దాని కొసన అమర్చబడిన కొక్కెం సిడి వ్రేలాడే వాని వీపు చర్మంలో గుచ్చబడుతుంది. అలా గుచ్చిన తరువాత త్రాడును కప్పీల సహాయంతో పైకిలాగుతారు. సిడికి వ్రేలాడే భక్తుడు క్రమంగా పైకి లేచి గాలిలో నిలువుగా పాతిన కఱ్ఱచుట్టూ తిరుగుతూ ఉంటాడు. అలా తిరుగుతూ యుద్ధ వీరుడిలా కత్తిడాలూ తిప్పుతూ సంతోషంగా ఉల్లాసంగా కనిపించాలి. ముఖంలో దు:ఖం కానీ బాధ కానీ కనిపించ కూడదు. అలా కనిపిస్తే మొక్కు సరిగా చెల్లించబడినట్లు కాదు. తన ఒడిలో ఉన్న పూవులను తీసి కింద ఉన్న జన సమూహం మీదికి విసురుతాడు. కింద జనం ఆ పూల కోసం ఎగబడతారు. ఆ పూవులు ఇంట్లో ఉంటే ఆ ఇల్లు పాలు పొంగినట్లుగా పొంగుతుందని వారి విశ్వాసం.

ఇలా గ్రామదేవతల మొక్కులు చెల్లించడంగా మొదలైన ఈ విశ్వాసాన్ని క్రమంగా వీర శైవ మతంలో ప్రబలమైన ఆచారంగా కొనసాగించారు. ఈ రకంగా మాతృదేవతారాధన విషయకంగా జానపదుల గాథలు మనకు ఎంతో చరిత్రనూ, సంస్కృతినీ అందిస్తున్నాయి.

పాండురంగమహాత్మ్యంలో సిడిమ్రానును సీసపద్యంలో వర్ణన.

అంబోధరమునసియాడు నైరావ

తియుబోలెసిడివేలెదెఱవయోర్తు

చెందమ్మి కొలన రంజిల్లు నంచయుబోలె

నిప్పుటేట జరించే నెలతయోర్తు

తొలి సంధ్య ఎండ వర్తిలు నంచయును బోలె

నీగె పందిరిగుండ మింతి యోర్తు

జలనీలిపైనెక్కు కలువమొగ్గయు బోలె

ననటాకు నర్తించె నతివయోర్తు

కాంత యొక్కర్తు మూపున గండలిచ్చె

మారుగాలిచ్చె నొకసుధామధురవాణి

లలన యొక్కర్తు నోరి తాళంబులిచ్చె

శక్తి జాతర తమ భక్తి శక్తులెసగ

జానపద స్త్రీలు గొప్ప శక్తీ, భక్తీకల వాళ్లు.. ఎంతటి సాహసానికైనా వెనుకాడని ధీమణులు" తము మొక్కుకున్న రీతిలో ఆశక్తి మొక్కులు చెల్లించుకుంటారు.

ఏ మాత్రం భయపడకుండా ఒక ఆమె సిడిమ్రాను ఎక్కి ఆకాశంలో విహరించింది. మేఘం కింద మెరిసిన మెరుపులా ఉన్నది. ఈనాటికీ విజయనగరంలో చుట్టు పక్కల ప్రాంతాలలో సిడిమాను ఉత్సవం వైభవంగా జరుగుతుంది. దానిపై పూజారి కూర్చుని వీధుల్లో ఊరేగుతాడు. సిడిమాను మేఘాలు తాకే పొడవు కలదని కవివర్ణన. నిప్పులను ఆరుబయట నేల మీద పొడవుగా రాశిలాగా పోస్తారు. కవి దానిని నిప్పుల ఏరు అని వర్ణించాడు. ఆ నిప్పుల ఏరులో నడచిన స్త్రీ ఎఱ్ఱ తామర కొలనులో విహరిస్తున్న హంసలా ఉన్నదట.

మరొక స్త్రీ పందిరి కింద పోసిన నిప్పుల గుండంలో (పందిరి గుండం) నడక నడిచింది. ఆమె ఉదయ కాలపు ఎండలో తిరుగాడుతున్న హంసలా ఉంది. నిప్పులు తొక్కే స్త్రీలు హంసలలా ఉన్నారని ఉపమించాడుకవి. ఎండలో విహరించే చక్రవాకి పక్షిలా అనే పోలిక కూడా మనోహరంగా వర్ణించాడు కవి. నిప్పుల గుండంలో నడిచిన స్త్రీ చాలా ఆనందంగా మొక్కు తీర్చుకుంటున్నట్లు చెప్పడం ఆ జానపదుల స్త్రీల భక్తితత్పరత తెలుస్తోంది.

వేరొక స్త్రీ కొలను లోపలి నుంచి నిశ్శబ్దంగా నీటి పైకి ఎక్కి వచ్చిన కలువ మొగ్గలాగా వచ్చి అరిటాకుల పైన నృత్యం చేసింది. అరిటాకుపై నర్తించడం ఒక మొక్కు ఒక స్త్రీ మధురంగా మాట్లాడే స్వభావం కలది. మొక్కుకుని శరీరావయవాలు కాళ్ళూ చేతులూ, కళ్ళు వెండి బంగారాలతో చేసినవి మొక్కు చెలించి దేవతకి నమస్కరించింది.

ఒకామె నోరి తాళములు ఇచ్చిందట. నోరి తాళం అంటే జాతరలలో సాగే నృత్యాలకు

డప్పులతో అందించే వాద్య సహకారాన్ని అందించడం. ఇది ఒక మొక్కుగా ఒక స్త్రీ చెల్లించుకుంది. ఇప్పటికీ ఈ సంప్రదాయ సంగీతం కచేరిలలో ఈ నోటి తాళం మనిషి అక్కడక్కడా కనబడుతూ ఉంటాడు. ఇతడిని కొన్నోకల్ అని అంటారు.

ఈ ఉత్సవ సమయంలో అనేక వాయిద్యాలు మ్రోగుతున్నాయి. చాలా పెద్ద ధ్వనులు పుట్టాయి. ఆలయంలోని ఉత్సవమూర్తులు సొంపుగా అలంకరింపబడినాయి. కొమ్ముబూరాలు ఊదేవాళ్ళు వరుసలలో నిలబడి "భూ" అనే ధ్వనులను మ్రోగిస్తున్నారు. నాట్యకత్తెలు ధారిధీమిత ధిత్తాధిమిత అంటూ ఓ పక్క నాట్యం చేస్తున్నారు. కనక తప్పెటలు, నగారాలు ధనాధనా మ్రోగుతుంటే చుట్టు ప్రక్కల పల్లెటూళ్ళ నుండి ప్రజలు గుంపులు గుంపులుగా వస్తుంటే సంబరం కన్నుల పండువగా ఆనందంగా జరుగుతుంది.

వెంకటేశ్వరునికీ అలివేలు మంగమ్మకీ నారాయణవనంలో పెళ్ళి జరుగుతుంది. పెండ్లికొడుకు పెండ్లి కుమార్తె తిరుమలకు బయల్దేరారు. రాజకుమార్తెకి సారె పెట్టారు. ఏమిసారె ఉన్నదో అని చూసిన శ్రీనివాసునుకి  కరివేపాకు కనిపించలేదు. కరివేపాకు ఎందుకు తేలేదని అడిగాడు. ఇప్పుడు వెళ్ళి తెస్తానని అలవేలు మంగమ్మ చెప్తుంది. అప్పుడు శ్రీనివాసుడు సూర్యోదయం కంటె ముందే రావాలని అలా రాకపోతే నువ్వు ఎక్కడ ఉండగా సూర్యోదయం అయితే అక్కడే పూజలు అందుకుంటావని చెబుతాడు. అలవేలు మంగమ్మ గబగబా నారాయణ వనానికి వెళ్లి బోలెడంత కరివేపాకును తీసికుని తిరిగి వస్తుండగా తిరుచానూరుకి వస్తుండగా సూర్యోదయం అయిపోతుంది. అలమేలు మంగమ్మ తిరుచానూరులో పూజలు అందుకుంటున్నదని ఒక జానపద ఐతిహ్యం.

తిరుమలలో శ్రీవారి ఆలయ మహా ద్వారానికి ఎదురుగా ఒక మండపం ఉంది. దాన్ని గొల్ల భామ మండపం అంటారు. పూర్వం ఒక గొల్లభామ కొండపైకి వచ్చిపోయే యాత్రికులకి మండపందగ్గర కూర్చుని పాలు, మజ్జిగ దానం చేసేది. శ్రీనివాసుని భక్తురాలైన ఆమె జ్ఞాపకార్థంగా ఆ మండపాన్ని గొల్లభామ మండపం అనే పేరుతో పిలుస్తున్నారన్నది ఒక కథ. ఇది స్థానిక ఐతిహ్యాలు.

పుంగమ్మ అనే ఆమె పూర్వం ఒక చెరువు తవ్వించింది. వర్షాలు పడినప్పుడల్లా చెరువు నిండిపోయి ఎక్కడో అక్కడ కట్టతెగేది. ఇలా ఎందుకు ఇబ్బంది అవుతుందోనని ఆలోచించి ఆత్మబలి ఇచ్చుకుంటే కట్ట తెగదని నిర్ణయించుకుంది. కట్ట తెగిన చోట చెరువులో దూకి ఆత్మ బలిచేసుకుంది. పుంగమ్మ మీద మట్టి పోసి గండిపూడ్చారు. అప్పటి నుంచి చెరువు కట్ట తెగలేదు. చెరువు కట్ట దగ్గరే ఆమె విగ్రహానికి గుడి కట్టించి పూజలు చేస్తారు. పుంగమ్మ ఆత్మ సమర్పణ  చేసుకున్న చెరువు కనుక పుంగమ్మ చెరువు అని పేరు. పక్కన గ్రామాలకి పుంగమ్మవూరు  పేరే కొద్దిగా మారి పుంగనూరుగా పిలువబడుతోంది.

**కోడి పందెములు**

ఉత్సవాలు, పండుగల సందర్భములలో కోడి పందెములు కూడా ఒక వేడుకగా గ్రామములలో జానపదుల వినోదముగా వింటూనే ఉంటాము. పూర్వము ఈ కోడి పందెములు విస్తారంగా జరిగేవి.

అనేకమైన చారిత్రక రణములకు ఈ కోడి పందెము ప్రధాన కారణంగా చరిత్రలో చదివే ఉన్నాము. ప్రభుత్వము దీనిని నిషేధించినా మారుమూల గ్రామ సీమలలో ఈ వేడుక జానపదులకు ఆనందమే.

అయ్యలరాజు నారాయణామాత్యుడు 'తన హంస వింశతిలో'' కోడి పందెములను ఈ క్రింది పద్యములలో వర్ణించాడు.

కందపద్యం : అంతటని తాంతహర్ష

స్వాంతయుత ద్యూత జనవరక్షుభిత హరి

ద్దంతి శ్రుతియైనగర

ప్రాంతంబున కోడి పదువు పందెము సాగెన్ (హంస వింశతి 3ఆ - 211 పద్యం)

కోడి పందాలు జరిగే చోట పందెం కాసేవారు, ఆట చూసేవారు ఒక చోట పోగయ్యారు. జనం అధిక సంఖ్యలో వచ్చారు. చాలా ఆనందంగా కేరింతలు కొడుతున్నారు. వారి అరుపులు, కేకలకు దిగ్గజముల చెవులకు బాధకలిగినదని అతి శయోక్తిలో వర్ణనమిది. అంత అధికమైన కోలాహలం వాతావరణం నెలకొందని పద్యమునకు తాత్పర్యం.

తేటగీతి : కావి ప్రాతలు దారాలు కట్టుముళ్ళు

ముష్టులును నీళ్ళ ముంతలు మూలికలును

కత్తుల పొదుళ్ళు మంత్రముల్కట్టు పసరు

లెనయ వచ్చిరి పందెగాళ్ళేపు రేగి (హంస వింశతి 3ఆ 212 పద్యం)

కోడి పుంజులను పట్టుకు వచ్చిన పందెం కాసిన వారిని కవి వర్ణిస్తున్నాడు. కాషాయ బట్టలు కట్టుకొని ఉన్నారు. దారములు కట్టుముడులు, కత్తిపిడులు పట్టుకు వచ్చారు. నీళ్ళలో నిండి మంతలు కోళ్ళకు గాయాలైతే ప్రథమ చికిత్సకు కొన్ని మూలికలు, కత్తుల పొదులు కోళ్ళకు కట్టే కత్తులు తెచ్చారు. సరంజామా అంతా సిద్ధం చేసుకొని కోడిపందాలకు పందెం కాసే వారు హుషారుగా వచ్చారని అర్థం.

కోళ్ళు అనేక లక్షణాలతో ఉంటాయి. ముఖ్యంగా పందానికి పెంచబడుతున్న కోళ్ళకి చాలా చరిత్ర ఉంటుంది.డేగవన్నె నెమలి వన్నె పింగళి వన్నే, కోడివన్నె డేగకాకివన్నె ఇలా సాముద్రిక చిహ్నాలను బట్టి 5 జాతులు ఉంటాయి. వీటిలో ఏ పుంజు ఎప్పుడు గెలుస్తుందో ఏ జాతి పుంజుకు భోజన సమయమొప్పుడో, నిద్రా సమయమెప్పుడో, ఆ పుంజుతో ప్రయాణం ఎప్పుడు చేయవచ్చో దాని మరణ కాలమెప్పుడో - ఈ వివరాలన్నీ తెలిసికొని వాని ఉపజాతులు జాతకాలు పరిశీలించి పందెమునకు తగిన వనుకొన్న పుంజులను నిర్ధారించి వానిని తీసికొని పందెములు జరిపే ఆట స్థలమునకు పందెగాళు వచ్చారు.

గిరిగీసి వృత్తాకారపు గీత లోపల పుంజులను వదలిపెడతారు. బరిలో నిలబడి ఉన్న కోళ్ళను

చిటికె వేసి యుద్ధమునకు ప్రారంభించమని బయటకు తప్పుకుంటారు. పుంజులు పెడేపెడీ తన్నడం మొదలు పెడతాయి. అదొక కురుక్షేత్రం మాదిరి కోలాహలం.

కోడిపుంజులకు పందెగాళ్ళ పెట్టిన పేర్లు ఈ సీసపద్యంలో వర్ణించబడింది.

సీసపద్యం : పట్టెజుట్టుది మైలపుట్టజట్టుది గూబ
చిలుక జుట్టుది మూగ చిల్లకోడి
పట్టుమార్పుది యరజుట్టుది బోరది
బూడిద వన్నెది పొడది చిల్ల
కాలుది గుజ్జుది గాజుల కాలుది
కలది పండె ఙ్టదిగద్దెకాలు
దెఙ్టని దురగది నీకెలకాలిది
నల్లది కొప్పది త్లెయురగ

తేటగీతి : పిల్ల వేళ్ళది మొద్దుది నల్లయురగ
లనగ దగుకత్తి కాట్టంజులందులోన
ఓసపు పావళ్ళు కాలందెలెసగునట్లు
రావిరేకలు బిరుదలు – తీవిగలుగు (హంస వింశతి 3ఆ – 214 పద్యం)

వాటి ఆకార విశేషాలను బట్టి వాటిని పిలుస్తారు. ఎక్కువగా కూత పెట్టని పుంజు "మూగ" అనీ బూడిదరంగులో ఉన్నదానిని బూడిద వన్నెది అని పేరెట్టారు. పుంజులకు పసుపు గుడ్డ పీలికలు చుట్టి రక్షణ కోసం రావిరేకలు కట్టారు. అంటే రావి ఆకు ఆకారంలో ఉండే వెండి రేకులు అని అర్థం ఇలా అలంకరింపబడిన పుంజులు చాలా తీవిగా ఉన్నాయి.

సీసపద్యం : గరుడుండు శరభంబు కంచుడమారము
రణభేరి కార్చిచ్చు ఙాతిబొమ్మ
రాముబాణముమిత్తి రాహుత్తి పిడుగుహం
వీరుండు పుంజుల వేరువిత్తు
గండకత్తెర గుండె గాలంబు మాస్టీడు
పట్టభద్రుడు జెట్టి భైరవుండు
కత్తులపొది సింహగాలి బేతాళుండు
పసులపాతర పాదరనము చిలుకు

తేటగీతి : టమ్ము సుడిగాలి చక్రంబు నలజడదరి

శూలము పిరంగి వెలినక్క సాలువంబు

కాళరాత్ర్యంతకుడు పందెగాంఁడ్ర మెచ్చు

లనెడు పేరుల పుంజుల గొని మొగించి (హంస వింశతి 3ఆ - 215 పద్యం)

ఇవి అన్నీ పందెపు పుంజుల పేర్లే. కోడి పుంజులు పందెంలో ఏ విధంగా పౌరుషం ప్రదర్శిస్తాయో ప్రత్యర్థులైన పుంజులను ఓడిస్తాయో చూసి వాని స్వభావానికి అనుగుణంగా పెట్టిన పేర్లు ఇవి. కార్చిచ్చు ఒక జాతి పుంజు పేరు. కార్చిచ్చు అంటే అడివిని కాల్చేస్తూ వ్యాప్తిస్తున్న అగ్ని. అది ఇటువంటి పరాక్రమం కలది అని అర్థం అనమాట. అలాగే మరోపుంజు పేరు 'రాతిబొమ్మ' బరిలోకి దిగితే ధైర్యంగా స్థిరంగా నిలబడుతుంది. పారిపోదు అని భావం. మస్టీడు - అంటే ఏనుగును నడిపేవాడు అంతటి పరాక్రమంగల పుంజు అని అర్థం. సింహగాలి - సింహంలా గాల్లోకి ఎగురుతుంది అని బహుశ అలా చెప్పి ఉంటారు. నలజడది - నల్లని ఈకలు ధరించినది అరిశూలము - కాళరాత్రి లాంటి సంస్కృత సమాసాలు కూడా వీటికి నామధేయాలే. కవిత్వం కూడా మన జానపదుల జీవితంలో అంతర్భాగం.

మిగిలిన పేర్లన్నీ సులభంగా అర్థమవుతాయి.

ఈ విధంగా జానపద సాహిత్యంలో స్పష్టంగా ప్రాచీనమైన ఆచారాలు, నమ్మకాలు గుబాళిస్తూ చదువరులను అలరిస్తూనే ఉంటాయి. దీనిలోని సాంఘిక చరిత్ర, వైభవము తెలుగుజాతి చరిత్ర సంస్కృతులతో రంగరించి ఆహ్లాదాన్ని కలిగిస్తూ తెలుగు వారి హృదయాలపై చెరగని ముద్ర వేసింది జానపద సాహిత్యం.

వ్యాసరచన- శ్రీమతి వి.ఎ.ఎస్.శారదాకుమారి

11-1-23,ప్రకాశం వీధి,

రామారావు పేట

కాకినాడ.

తూ॥గో॥ జిల్లా. 533 004.

ఇండియా.

ఫోన్ : 94940 08020